క్లుప్తంగా

బీజేవైఎం అధికార ప్రతినిధిగా సతీష్‌కుమార్

చిట్యాల: పట్టణానికి చెందిన కంబాలపల్లి సతీష్‌కుమార్‌యాదవ్‌ను బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కె.కిషన్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో సతీష్‌కుమార్ యాదవ్ నిజాం కాలేజీ విద్యార్థి పరిషత్ అధ్యక్షుడిగా, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో ఓయూ జేఏసీ రాష్ట్ర కన్వీనర్‌గా పనిచేశారు.

అడిషనల్ సెక్రటరీగా త్రివిక్రమ్

కేతేపల్లి: మండలంలోని చెర్కుపల్లి గ్రామానికి చెందిన కట్కోజు త్రివిక్రమ్ బీజేపీ యువ మోర్చా రాష్ట్ర అడిషనల్ సెక్రటరీ అండ్ కాలేజ్ అవుట్‌రీచ్ సెల్ కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఈమేరకు బీజేపీ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చేవెళ్ల మహేందర్ గురువారం త్రివిక్రమ్‌కు నియామక పత్రం అందజేశారు.

జనజాతర సభను విజయవంతం చేయాలి

మర్రిగూడ: ఈనెల 6న తుక్కుగూడలో జరిగే జనజాతర సభను విజయవంతం చేయాలని ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమావత్ శ్రీనునాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రాజునాయక్, లక్ష్మణ్‌నాయక్, విజయ్‌నాయక్‌లు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

చిట్యాల: మండలంలోని గుండ్రాంపల్లి గ్రామంలో ఏసిరెడ్డి శ్రీరామ్‌రెడ్డి, ఏసిరెడ్డి కృపాకర్‌రెడ్డి జ్ఞాపకార్థం శుక్రవారం నుంచి ఈ నెల 12 వ తేదీ వరకు ఉచితంగా కంటి శుక్లం శస్త్ర చికిత్స వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు వైద్య శిబిరం నిర్వాహకుడు డీసీసీబీ వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నైకు చెందిన శంకర్ నేత్రాలయ కంటి వైద్యశాల, అమెరికన్ తెలుగు అసోసియేషన్ సౌజన్యంతో ఉచితంగా కంటి శుక్ల శస్త్ర చికిత్స వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 8008106566, 7989131262 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కానిస్టేబుల్ నాగరాజుకు ఘన నివాళి



నాగరాజు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎస్‌ఐ శ్రీను, తదితరులు

కట్టంగూర్ : అమరవీరుల ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కట్టంగూర్ ఎస్‌ఐ శ్రీను అన్నారు. ఉగ్రవాదుల కాల్పుల్లో మృతి చెందిన అయిటిపాముల జీపీ పరిధి రసూల్ గూడెంకు చెందిన కానిస్టేబుల్ చెవుగోని నాగరాజు 9వ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయిటిపాముల గ్రామంలో ఏర్పాటు చేసిన నాగరాజు విగ్రహానికి ఎస్‌ఐ పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్యగౌడ్, పబ్బు వెంకటేశ్వర్లు, చెవుగోని నాగరాజు, శ్రీమన్నారాయణ, కొమ్ము కోటేష్, ముత్యాల లింగయ్య పాల్గొన్నారు.

ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం

చిట్యాల: రాష్ట్ర ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్‌ను హైదరాబాద్‌లో చిట్యాల మున్సిపాలిటీ శివనేనిగూడెం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం చైర్మన్ నూతి సైదులుముదిరాజ్ గురువారం కలిసి సన్మానించారు. తమ గ్రామ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ప్రచార కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను విడుదల చేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

నకిరేకల్ : మున్సిపాలిటీ కేంద్రలోని సాయి మందిరంలో ఉగాది పర్వదినం, శ్రీసీతారామ చంద్ర స్వామి కల్యాణ ప్రచార కరపత్రాన్ని గురువారం ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి యాట మధుసూదన్‌రెడ్డి విడుదల చేశారు. 9న ఉగాది పండుగ రోజున కోదండరామశర్మ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం, 17న మందిరంలో శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి ఉప్పల వెంకటరమణ, పూజారి దుర్గి మురళీధర్ శర్మ, సభ్యులు రాములు, తొనుపునూరి రాంబాబు, బండారు వేణుగోపాల్, దాచేపల్లి శ్రీనివాస్, బొబ్బలి నర్సింహారెడ్డి, పిల్లలమర్రి సునీత, దేవరశెట్టి మధుసూదన్, బ్రహ్మదేవర వేణు, వంటిపాక సైదులు, ముప్పారం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటులో నిర్లక్ష్యం

- దళారులను ఆశ్రయిస్తున్న రైతులు
- మర్రిగూడ మండల కేంద్రంలో ఏర్పాటు కాని కొనుగోలు కేంద్రం



రాంరెడ్డిపల్లిలో వరి ధాన్యం కొనుగోలు చేస్తున్న ప్రైవేట్ వ్యక్తులు

మర్రిగూడ: రైతులు పండించిన పంటకు మద్దతు ధర కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేస్తోంది. అయితే ప్రభుత్వం ఆదేశించినా మర్రిగూడ మండలంలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటకు ప్రభుత్వం కల్పించే కనీస మద్దతు ధర కరువైందని వాపోతున్నా అధికార యంత్రాంగం స్పందించడం లేదు. చేతికొచ్చిన పంటను ఎక్కడ విక్రయించాలో తెలియక దళారులను ఆశ్రయించి క్వింటాకు రూ.500 నుంచి రూ.600వరకు నష్టపోతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మర్రిగూడ మండల వ్యాప్తంగా 16002 రైతులు ఉన్నారు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో రైతులు 5078 ఎకరాల్లో వరి సాగు చేశారు. గత యాసంగిలో 5063.2 ఎకరాల్లో సాగు చేశారు. అయితే మర్రిగూడ మండలంలో రైతుల అవసరాల మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో చేతికొచ్చిన పంటను మాల్, చింతపల్లి, చండూరు మండలాలకు రైతులు తరలించాల్సి వస్తోంది. లేదంటే దళారులకు ఇక్కడే విక్రయిస్తే రవాణా చార్జీల భారం కూడా రైతుల పైనే భారం పడుతోంది.

గతంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు..

శివన్నగూడ ఎఫ్‌ఏసీఎస్(రైతు సేవా సహకార సంఘం)తోపాటు ఖుదాబాక్షపల్లి, నామాపురం గ్రామాల్లో సబ్ సెంటర్లను వానాకాలం సీజన్‌లో ఏర్పాటు చేశారు. అదేవిధంగా మర్రిగూడ మండల సమాఖ్య ఆధ్వర్యంలో మండల కేంద్రంతోపాటు యరగండ్లపల్లి సబ్‌సెంటర్‌ను వానాకాలం సీజన్‌లో ఏర్పాటు చేశారు. శివన్నగూడ సంఘం ద్వారా వానాకాలంలో ఐదు వేల క్వింటాళ్లు, మర్రిగూడ సంఘం ఆధ్వర్యంలో 2,200 క్వింటాళ్ల ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేశారు. ప్రస్తుతం శివన్నగూడతోపాటు ఖుదాబాక్షపల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను బుధవారం ఏర్పాటు చేశారు. మర్రిగూడ మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో యరగండ్లపల్లిలో గురువారం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కానీ మండల కేంద్రంలో ఏర్పాటు చేయలేదు. రాజాపేటతండా, వట్టిపల్లి, బట్టపల్లితోపాటు పలు గ్రామాల రైతులు మండల కేంద్రంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

జోరుగా దళారుల దందా...

మండల వ్యాప్తంగా రెండు వారాల నుంచి వరి కోతలు మొదలయ్యాయి. కానీ మండల కేంద్రంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయకపోవడంతో దళారులు ప్రభుత్వ మద్దతు ధర కంటే క్వింటాలుకు రూ.400 నుంచి రూ.500 తగ్గించి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ఉన్నతాధికారులు వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.

క్వింటాకు రూ.1850 చెల్లించారు



ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో ధాన్యాన్ని దళారులకు అమ్మాల్సి వచ్చింది. క్వింటాకు రూ.1850 చెల్లించారు. హమాలీ ఖర్చులు కూడా రైతులే భరించాల్సి వచ్చింది. మర్రిగూడలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే క్వింటాకు మద్దతు ధర రూ.2203 వచ్చేవి. ప్రైవేట్ వ్యక్తులకు అమ్మడం వల్ల ఆర్థికంగా నష్టపోయాం.

–సిలివేరు రాములు, రైతు, రాంరెడ్డిపల్లి

రూ.400 నుంచి రూ.500 నష్టపోయాం



నాకున్న రెండెకరాల వరి పంటకు మద్దతు ధర లేకపోవడంతో దాదాపు రూ.10వేల వరకు నష్టపోయా. రెండు ఎకరాలు సాగు చేస్తే 23 క్వింటాళ్లు అయ్యాయి. పెట్టుబడి రూ.60వేలు దాటింది. క్వింటాకు రూ.400 నుంచి రూ.500 నష్టపోవాల్సి వచ్చింది. మండల కేంద్రంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే ఇబ్బందులు తప్పేవి.

–వెంకటంపేట నరేష్, రైతు, రాజాపేటతండా

మూడు రోజుల క్రితమే మంజూరు వచ్చింది

మండల సమాఖ్య ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని మూడురోజుల క్రితమే ఆదేశాలు వచ్చాయి. కొనుగోలు కేంద్రానికి 5వేల నుంచి 10వేల క్వింటాళ్ల ధాన్యం వస్తే బాగుంటుంది. గత వానాకాలంలో తక్కువ ధాన్యం వచ్చింది. ధాన్యం అధికంగా వచ్చేవిధంగా స్థల పరిశీలన చేసి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని మండల సమాఖ్యకు సూచించాం. స్థల పరిశీలన పూర్తయిన వెంటనే ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తాం.

–అరుణ్‌కుమార్, డీపీఎం

ఉపాధి హామీ పనుల పరిశీలన

నార్కట్‌పల్లి : ఎండ తీవ్రతకు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఉపాధి హామీ కూలీలు ఉదయం 7 గంటలకే పనికి హాజరుకావాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి అన్నారు. గురువారం నార్కట్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించి కూలీలతో మాట్లాడారు. రోజుకు రూ.300 చొప్పున కూలి రావాలంటే ఎంత పని చేయాలో అవగాహన ఉందా అని కూలీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేశారు. ఆయన వెంట అడిషనల్ డీఆర్‌డీఓ నవీన్, ఏపీడీ ఉపేందర్‌రెడ్డి, ఎంపీడీఓ ఉమేష్, ఏపీఓ యాదయ్య, సీహెచ్ఓ శ్రీరాములు తదితరులు ఉన్నారు.

పుస్తకాలు అందజేత



పుస్తకాలు అందజేస్తున్న బుచ్చిరెడ్డి

మునుగోడు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రంథాలయానికి రచయిత, బాల సాహితీవేత్త కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి తాను రాసిన పుస్తకాలను ఉచితంగా అందజేశారు. పుస్తకాలు చదవడం వల్ల కలిగే ప్రయోజనాలను గురువారం ఆ పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎన్. యాదయ్య, ఉపాధ్యాయులు బూత రాజు అంజయ్య, చంద్రం, పిండి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రధాన కార్యదర్శిగా బోయపల్లి రాజు

మర్రిగూడ: బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా మండలంలోని ఖుదాబాక్షపల్లి గ్రామానికి చెందిన బోయపల్లి రాజు ఎన్నికయ్యారు. గురువారం బీజేపీ మండల అధ్యక్షుడు పాత్లావత్ రాజేందర్‌నాయక్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా యాస అశోక్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా కేసరి రవీందర్‌రెడ్డి, చాపల వెంకటేష్‌యాదవ్, రాకొండ ప్రదీప్‌రెడ్డి, సిలివేరు వెంకటేష్, జిల్లా కిశోర్, సిలివేరు దేవేందర్, కార్యదర్శులుగా కొట్టం నాగరాజుయాదవ్, గ్యార రామలింగం, కట్టెం నర్సింహాచారి, నల్ల కలమ్మ, దండేట్కర్ శోభన్ బాబు, కుక్కల వెంకటేష్, కోశాధికారి కేసరి ముత్యంరెడ్డి, యువమోర్చా అధ్యక్షుడిగా అయిలి పెద్దయ్యగౌడ్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడిగా పగిళ్ల లింగస్వామి, మహిళా మోర్చా అధ్యక్షురాలిగా రమావత్ చంద్రకళ, దళిత మోర్చా అధ్యక్షుడిగా చల్లం శంకర్, కిసాన్‌మోర్చా అధ్యక్షుడిగా అంబాల రమేష్, గిరిజన మోర్చా అధ్యక్షుడిగా ఆంగోతు భాస్కర్‌నాయక్, మైనార్టీ మోర్చా అధ్యక్షుడిగా మహమ్మద్ సయ్యద్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ మండలంలో బీజేపీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషిచేస్తామని తెలిపారు.

మహిళ అదృశ్యం

నార్కట్‌పల్లి: కట్టంగూరు మండలం ఈదులూరు గ్రామానికి చెందిన ఊట్కూరి సరిత (35) మానసిక స్థితి బాగోలేకపోవడంతో నాలుగు సంవత్సరాలుగా తన తల్లి గారి గ్రామమైన నార్కట్‌పల్లిలో ఉంటోంది. ఈ నెల 2వ తేదీ సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇప్పటివరకు తిరిగి రాలేదు. గురువారం కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో మహిళ అదృశ్యం అయినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్‌ఐ తెలిపారు.

ఉపాధి కూలీలకు అందని వేతనాలు



మునుగోడు పెద్ద చెరువులో ఒండ్రు మట్టి తవ్వుతున్న ఉపాధిహామీ కూలీలు

- దాదాపు మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న కూలీ డబ్బులు
- ఇబ్బందిగా మారిన కుటుంబ పోషణ
- నిధులు విడుదల చేయాలని వేడుకోలు

మునుగోడు: వలసలు నివారించి గ్రామాల్లోనే ప్రతిఒక్కరికీ పని కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని అమలు చేస్తోంది. ఉపాధి పనులకు వెళ్లిన కూలీలకు ప్రతి వారం డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. కానీ మునుగోడు మండలంలో ఈ ఏడాది జనవరి మాసం నుంచి ఇప్పటివరకు కూలీలకు డబ్బులు అందడం లేదు. దీంతో కూలి పనులపై ఆధారపడి జీవించే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూడు నెలలుగా కూలీ డబ్బులు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిందని పలువురు వాపోతున్నారు.

జనవరి నుంచి 86 వేల పనిదినాలు..

మునుగోడు మండల వ్యాప్తంగా 27 గ్రామాల్లో మొత్తం 11,550 జాబ్‌కార్డులు ఉండగా 24,291 మందికి కూలీలు పని చేసే అవకాశం ఉంది. అందులో ప్రతి ఏటా 6597 మంది ఉపాధిహామీ పనులు చేస్తున్నారు. ఆ కూలీలు గత జనవరి మాసం నుంచి మార్చి 31వ తేదీ వరకు మొత్తం 86,000 పనిదినాలు ఉపాధి హామీ పనులు చేశారు. వారికి గరిష్ఠంగా రోజుకు రూ. 272 చొప్పున వేతనం అందాల్సి ఉంది. కొలత ఆధారంగా డబ్బులు ఇస్తుండడంతో సగటున రోజుకు రూ.182 చొప్పున గిట్టుబాటు అవుతోంది. అలా 86వేల పనిదినాలకు దాదాపు కోటి 60 లక్షల రూపాయలు చెల్లించాల్సి ఉంది. కానీ కూలీ డబ్బులు మూడు నెలలు దాటినా ఖాతాల్లో జమకావడం లేదు. ఉన్నతాధికారులు చొరవ తీసుకొని డబ్బులు వెంటనే అందించేలా చొరవ చూపాలని కూలీలు కోరుతున్నారు.

కుటుంబ పోషణకు ఇబ్బందిగా ఉంది



మాది నిరుపేద కుటుంబం. నేను ప్రతి రోజు ఉపాధిహామీ పనులకు వెళ్లి ఆ డబ్బులతో ఇంటి అవసరాలు తీర్చుకుంటా. గత జనవరి మాసం నుంచి మార్చి చివరి వరకు 40 రోజులు పనికి వెళ్లాను. అందుకు నాకు రూ.8200 రావాల్సి ఉంది. కానీ నేటికీ డబ్బులు అందలేదు. అధికారులను అడిగితే సరైన సమాధానం చెప్పడం లేదు.

– విష్ణు, ఎల్గలగూడెం

రెండున్నర నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి



ఉపాధిహామీ కూలీలకు అందాల్సిన డబ్బులు ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో రెండున్నర నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే కూలీల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయి. పనులకు కొలతలువేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయడమే మా పని. కూలీలకు డబ్బులు అంతా ఆన్‌లైన్ ద్వారానే అందుతాయి.

– శ్రీనయ్య, ఏపీఓ

యూటీఎఫ్ కార్యాలయంలో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందుకు హాజరైన ఉపాధ్యాయులు

రామగిరి(నల్లగొండ): యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో గురువారం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ముస్లిం ఉపాధ్యాయులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం ఉపాధ్యాయులు మౌలానా వాహిద్, ఖాదర్, యూసఫ్ అలీ, ఆఫీస్ అన్సారీ, రఫిక్, హజిం, హమీద్, టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సైదులు, ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం, కోశాధికారి నర్రా శేఖర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శులు గేర నరసింహ, నలపరాజు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కిసాన్‌మోర్చా మండల కమిటీ ఎన్నిక

చౌటుప్పల్ : బీజేపీ కిసాన్ మోర్చా మండల కమిటీని గురువారం ఎన్నుకున్నారు. బీజేపీ జిల్లా కార్యదర్శి బత్తుల జంగయ్య, మండల అధ్యక్షుడు చినుకని మల్లేష్‌లు నూతన కమిటీని ప్రకటించారు. బీజేపీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడిగా ఆరెగూడెం గ్రామానికి చెందిన మునగాల అమరేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా సుర్కంటి మోహన్‌రెడ్డి, పబ్బు కుమార్, ఆనగంటి వెంకటేష్, వాకిటి రమణారెడ్డి, ఏనుగు అంజిరెడ్డి, బాతరాజు మహేష్, ప్రధాన కార్యదర్శిగా నాతి సురేష్, కార్యదర్శులుగా పర్నె రాంచంద్రారెడ్డి, పగిళ్ల లింగారెడ్డి, నీల సంజీవ, యాస అశోక్‌రెడ్డి, కందగట్ల జంగారెడ్డి, గోదుమగడ్డ అంజిరెడ్డి, కోశాధికారిగా రేఖ పాపయ్య, సభ్యులుగా బద్దం రాజు, తంగళ్ల వెంకటేశం, సుర్కంటి మోహన్‌రెడ్డి, కడగంచి పాపయ్య, బొంగు అంజయ్య, పడమటి శివారెడ్డి నియమితులయ్యారు.

చట్ట సభల్లో బీసీల సంఖ్య పెరగాలి



మాట్లాడుతున్న పాలకూరి రవిగౌడ్

నల్లగొండ టూటౌన్ : చట్ట సభల్లో బీసీల సంఖ్య పెరగాలని, బడుగు, బలహీనవర్గాల ప్రజలందరు ఓటు హక్కు వినియోగించుకోవాలని బీసీ కుల సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు పాలకూరి రవిగౌడ్ అన్నారు. గురువారం నల్లగొండ పట్టణంలో బీసీ కుల సంఘాల ఐక్యవేదిక కార్యాలయాన్ని ప్రారంభించి అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలు జనాభాలో 50 శాతం ఉన్నప్పటికీ రాజకీయాల్లో వెనుకబడి పోయారన్నారు. కొన్ని సామాజిక వర్గాలు బీసీలపై వివక్ష చూపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీల సమస్యల పరిష్కారానికి వేదిక ఆధ్వర్యంలో కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షుడు కర్నాటి యాదగిరి, రాజరికం నర్సింహాచారి, అఖిల భారత గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెరుకు మల్లికార్జున్‌గౌడ్, జక్కల సుధాకర్‌యాదవ్, బాసాని నరసింహ, నరేష్‌చారి, శ్రీశైలయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



చండూరు : కస్తాల గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీఓ సుబ్రహ్మణ్యం



చిట్యాల: పిట్టంపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ సీఈఓ రాజిరెడ్డి



మర్రిగూడ: యరగండ్లపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం ప్రభాకర్

చండూరు : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ సుబ్రహ్మణ్యం అన్నారు. మండల పరిధిలోని కస్తాల గ్రామంలో రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని 17 శాతం లోపు తేమ ఉండేలా చూసుకుని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలన్నారు. రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ దశరథ, ఏఓ రేవతి, ఆర్‌ఐ శేఖర్, సంఘం కార్యదర్శి నరేష్, కేంద్రం ఇన్‌చార్జ్ పనీంద్ర కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: వెలిమినేడు పీఏసీఎస్ ఆధ్వర్యంలో చిన్న కాపర్తి, పిట్టంపల్లి, ఆరెగూడెం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెలిమినేడు పీఏసీఎస్ సీఈఓ రాజిరెడ్డి, జిల్లా మానిటరింగ్ ఆఫీసర్ విజయకృష్ణ గురువారం ప్రారంభించారు. అదే విధంగా గుండ్రాంపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో గుండ్రాంపల్లి, సుంకెనెపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా మానిటరింగ్ ఆఫీసర్ విజయకృష్ణ, సీఈఓ రాజమల్లయ్య ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో ఏఈఓ కృష్ణకుమారి సిబ్బంది రాకేష్, అరవింద్, మహేష్, విజయ్, రైతులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా 370 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నార్కట్‌పల్లి: జిల్లా వ్యాప్తంగా 370 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు డీఎస్ఓ వెంకటేశ్వర్లు తెలిపారు. మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆయన వెంట తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్‌ఐ లింగస్వామి ఉన్నారు.

మర్రిగూడ: మండల పరిధిలోని యరగండ్లపల్లి గ్రామంలో గురువారం మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం ప్రభాకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు గీత, సీసీ శ్రీశైలం, సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

తూకంలో తేడా.. వేబ్రిడ్జి యజమానిపై కేసు నమోదు



రికార్డులను పరిశీలిస్తున్న నల్లగొండ లీగల్ మెట్రాలజీ అధికారి రామకృష్ణ, నార్కట్‌పల్లి ఎస్‌ఐ

నార్కట్‌పల్లి: ధాన్యం తూకంలో తేడా రావడంతో వేబ్రిడ్జి యజమానిపై కేసు నమోదు చేసినట్లు నల్లగొండ లీగల్ మెట్రాలజీ అధికారి రామకృష్ణ, నార్కట్‌పల్లి ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. నార్కట్‌పల్లి మండలంలోని అమ్మనబోలు గ్రామ శివారులో గల అరుణ వేబ్రిడ్జి వద్ద బుధవారం సాయంత్రం రైతులు వడ్ల కాంటా వేయగా.. తూకంలో తేడాలు ఉన్నట్లు గుర్తించారు. దీంతో సమీపంలోని అక్కెనపల్లి గ్రామంలో ఉన్న వేబ్రిడ్జిలో అవే వడ్లను కాంటా వేయగా.. రెండు క్వింటాళ్లు తేడా వచ్చింది. రైతులు ఫిర్యాదు మేరకు గురువారం నల్లగొండ లీగల్ మెట్రాలజీ అధికారి రామకృష్ణ, నార్కట్‌పల్లి ఎస్‌ఐ అంతిరెడ్డి కలిసి అరుణ వేబ్రిడ్జి వద్దకు చేరుకుని పరిశీలించారు. వేబ్రిడ్జి ఇండికేటర్‌కు వెరిఫికేషన్ సీల్ లేకుండా ఉండటంతో వేబ్రిడ్జి యజమానులు మిర్యాల శ్రీహరి, జంగిలి నర్సింహ, బర్రిశెట్టి కార్తీక్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నల్లగొండలో గెలిచి మోదీకి బహుమతిగా ఇస్తాం



మాట్లాడుతున్న శాంతిస్వరూప్

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ భారీ మెజార్టీతో గెలవబోతోందని, నల్లగొండలో గెలిచి మోదీకి బహుమతిగా ఇస్తామని బీజేవైఎం జిల్లా కార్యదర్శి గుండ్లపల్లి శాంతిస్వరూప్ అన్నారు. గురువారం నల్లగొండలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎంపీ అభ్యర్థి సైదిరెడ్డిని గెలిపిస్తామన్నారు. కేంద్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే అన్నారు. ఈ సమావేశంలో బీజేవైఎం నాయకులు నందిపాటి శ్రీకాంత్, చెరుకుపల్లి సాయికుమార్, లోహిత్‌రెడ్డి, చిట్యాల గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూములు ఆక్రమిస్తే చర్యలు

మాడుగులపల్లి: మండలంలోని కల్వలపాలెం గ్రామ శివారులో ఉన్న చెరువు, పాలేరు చెక్‌డ్యాం ఎఫ్‌టీఎల్ పరిధిలో మట్టిపోసి చదును చేసిన భూమిని గురువారం నీటిపారుదల శాఖ ఏఈ సాయిరెడ్డి సందర్శించారు. చెరువు, పాలేరు చెక్‌డ్యాం వెంట వ్యవసాయ భూములున్న కొందరు రాత్రివేళ గుట్టుచప్పుడు కాకుండా ఎఫ్‌టీఎల్ పరిధిలో మట్టిపోసి పూడుస్తున్నారని స్థానికులు ఏఈ దృష్టికి తీసుకురావడంతో గురువారం క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు. ఎఫ్‌టీఎల్ పరిధి భూమిని ఆక్రమించేందుకు యత్నించిన వారిని మందలించారు. వ్యవహారశైలి మార్చుకోవాలని లేకుంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చెరువు శిఖం భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు.

హామీలు అమలుచేయాలి

చౌటుప్పల్ : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా కార్యదర్శి కందుల తానీషాగౌడ్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణ కేంద్రంలో జరిగిన కిసాన్‌మోర్చా పదాధికారుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అధికారంలోకి వచ్చాక రైతుల కష్టాలను తీరుస్తామంటూ గొప్పగా చెప్పిన కాంగ్రెస్ నాయకులు ప్రస్తుతం తప్పించుకుంటున్నారన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రైతు సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని కోరారు. బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కర్నాటి ధనుంజయ్య, బత్తుల జంగయ్య, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, మల్లేష్, భిక్షమాచారి, జంగయ్య, అమరేందర్ రెడ్డి, కట్ట కృష్ణ, శ్రీధర్, రంగయ్య పాల్గొన్నారు.

శంకర్‌గౌడ్‌కు ఆర్మీ గౌరవ ర్యాంకు



శంకర్‌ను సత్కరిస్తున్న లక్ష్మారెడ్డి

నకిరేకల్ : మున్సిపాలిటీ కేంద్రంలోని ఏవీఎం ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న నిమ్మల శంకర్‌గౌడ్ శాశ్వత ఎన్‌సీసీ అధికారిగా ఆర్మీ గౌరవ ర్యాంకు పొందారు. శంకర్ 2019 నుంచి ఎన్‌సీసీ యూనిట్ నిర్వహణ శిక్షణ అధికారిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఎన్‌సీసీలో శాశ్వత అసోసియేట్ అధికారిగా నియామకం కోసం జనవరి 28వ తేదీ నుంచి మార్చి 28వ తేదీ వరకు మహారాష్ట్రలోని నాగపూర్ సైనిక శిబిరంలో శిక్షణ తీసుకున్నారు. శిక్షణ పూర్తి చేసుకుని ఎన్‌సీసీ అధికారిగా బాధ్యతలు చేపట్టిన నిమ్మల శంకర్‌కు గౌరవ ఆర్మీ ర్యాంకు కేటాయించిందని నల్లగొండ ఎన్‌సీసీ బెటాలియన్ కమాండ్ ఆఫీసర్ కల్నల్ ఎం.లక్ష్మారెడ్డి తెలిపారు. నిమ్మల శంకర్‌ను ఏవీఎం విద్యా సంస్థల అధినేత కందాల పాపిరెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ కందాల స్వప్నారెడ్డి, అడ్మినిస్ట్రేటర్ కందాల శ్రీకాంత్‌రెడ్డి, పీఆర్‌ఓ మిట్ట పూర్ణచందర్‌రెడ్డి సత్కరించారు.